క్లుప్తంగా

17న ఉచిత మెడికల్ క్యాంపు

విజయపురిసౌత్: సేవాలాల్ మహారాజ్ 285వ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 17న విజయపురిసౌత్‌లోని బయ్యారం సమీపంలో సేవాలాల్ మహారాజ్ ఆలయం వద్ద ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త కె.పాండు నాయక్ మంగళవారం తెలిపారు. తెలంగాణలోని మిర్యాలగూడకు చెందిన అపోలో రిచ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అధికారులకు రాజకీయ పార్టీల నేతలు సహకరించాలి



గురజాల : అధికారులకు రాజకీయ నాయకులు సహకరించాలని తహసీల్దార్ అశోక్‌కుమార్ రెడ్డి కోరారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం పలు పార్టీ ప్రజా ప్రతినిధులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తప్పుల తడక లేని ఓటర్ జాబితాను సిద్ధం చేసినట్లు తెలిపారు. అదేవిధంగా పోలింగ్ కేంద్రాల నిర్వహణ కూడా త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. ఇబ్బందులు ఉంటే ప్రజా ప్రతినిధులు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వెంటనే సమస్య పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామన్నారు. పార్టీ నాయకులు కూడా అధికారులకు పలు సలహాలు , సూచనలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలస్థాయి అధికారులు, నగర పంచాయతీ కమీషనర్ తదితరులున్నారు.

ఎంపీడీఓకు సన్మానం



దుర్గి: ఈఓపీఆర్డీ జీఎల్ఎన్ గుప్తా ఇన్‌చార్జి ఎంపీడీఓగా అదనపు బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం ధర్మవరం సచివాలయ సిబ్బంది, పంచాయతీ సెక్రెటరీ టి.శివకుమార్ ఎంపీడీఓను శాలువతో సత్కరించారు. మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది సహకరించాలని కోరారు. వీఏఏ తులసీనాయక్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వేణుగోపాల స్వామి ఆలయ వార్షికోత్సవం



రెంటచింతల: స్థానిక రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాల స్వామి ఆలయ ద్వితీయ వార్షిక మహోత్సవాలు బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ పల్లెర్ల సత్య వెంకటరామిరెడ్డి, ప్రధాన అర్చకులు గొట్టిపాళ్ల కృష్ణమాచార్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి శాంతి కల్యాణ మహోత్సవం కనుల పండువగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, స్వామివారి ఆశీస్సులు పొంది తీర్థ ప్రసాదాలు స్వీకరించాలన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్న సంతర్పణ చేయనున్నట్లు చెప్పారు. సాయంత్రం స్వామివార్ల ఉత్సవ విగ్రహాల గ్రామోత్సవం జరుగుతుందని తెలిపారు.

ధర్మవరంలో ఉచిత కంటి వైద్య శిబిరం



దుర్గి: వృద్ధులు కంటి సమస్యలను సరైన సమయంలో గుర్తించి, శస్త్ర చికిత్స చేయించుకోవాలని సర్పంచ్ గంగారపు వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం ధర్మవరం గ్రామంలో డాక్టర్ రామలింగారెడ్డి మ్యాక్సీ విజన్ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కంటి వైద్య నిపుణులు 150 మందికి పరీక్షలు నిర్వహించి, కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శ్రీనివాసరావు, రాజు, మురళీకృష్ణ, ఎంఎల్‌హెచ్‌పీ పవిత్ర, ఆశ కార్యకర్తలు లక్ష్మీకోటమ్మ, ఆశీర్వాదం పాల్గొన్నారు.

సరోజిని నాయుడికి నివాళి

పిడుగురాళ్ల: సరోజిని నాయుడిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని వక్తలు అన్నారు. పట్టణ సమీపంలోని కొండమోడు వద్ద కేఎస్ఆర్ విద్యా సంస్థలో సరోజినీ నాయుడు జయంతి కార్యక్రమం నిర్వహించారు. సరోజిని నాయుడు స్వాతంత్ర్యం సమరంలో ఎంతో పోరాటం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కోనేటి నరసింహారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి విజయానికి నాంది

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



తక్కెళ్లపాడులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి నాంది పలుకుతాయని గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. తక్కెళ్లపాడు, పెదగార్లపాడు, కేసానుపల్లి గ్రామాల్లో మంగళవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి పథకాల గురించి కార్యకర్తలకు, నాయకులకు వివరించారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయకేతనం ఎగురవేసేందుకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో గ్రామాల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించామన్నారు. ప్రజల గడప వద్దకే పథకాలు తీసుకొచ్చామన్నారు. సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజల కోరుకున్న విధంగా అవినీతి రహిత పాలన అందించామని పేర్కొన్నారు. మరోసారి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రావాలని ప్రజలు ఆశతో ఎదురు చూస్తున్నారని ఎమ్మెల్యే కాసు అన్నారు. గత టీడీపీ ప్రభుత్వ పాలనకు.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనకు మధ్య ఉన్న తేడాను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు ఆయన సూచించారు. సంక్షేమం, అభివృద్ధి పథకాల గురించి ప్రజలకు వివరించాలని చెప్పారు. రెండు నెలల్లో ఎన్నికలు వస్తున్నాయని, ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేసి, పార్టీ విజయం కోసం పనిచేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఎంపీపీ కటకం జయశ్రీ, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, పార్టీ మండల కన్వీనర్ కోట కృష్ణ, సర్పంచ్‌లు కర్పూరపు వెంకటకోటయ్య, వినుకొండ కోటేశ్వరరావు, ఎంపీటీసీలు జంగిలి నరసింహరావు, చెట్టిపాగు ఏసుదాసు, వైస్ ఎంపీపీ కందుల జాను, మాజీ సర్పంచ్ మందపాటి రమేష్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు బత్తుల లింగారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాకీర్‌హుస్సేన్, మాజీ ఎంపీటీసీలు గుడూరి గొవర్ధన్‌రావు తదితరులున్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.20లక్షల నిధులు..

తక్కెళ్లపాడు ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.20లక్షల నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఎస్సీ కాలనీలోని లూథరన్ చర్చిని ఆయన సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో కమ్యూనిటీ హాల్ నిర్మాణం పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని స్థానిక నాయకులకు సూచించారు. ఎస్సీ కాలనీవాసులు, చర్చి కమిటీ సభ్యులు ఎమ్మెల్యే మహేష్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు.

పీఆర్కే పరిష్కార మార్గం చూపారు



నూతనంగా ఏర్పాటు చేసిన పొలం దారి

దుర్గి: అడిగొప్పల గ్రామంలో పొలాలకు వెళ్లేందుకు సరైన దారి లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితిని స్థానిక ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి తన సొంత నిధులతో మట్టి తోలించి రోడ్డు వేయించారు. పొట్టి బ్రిడ్జి నుంచి నల్లవాగు వరకు ఐదు కిలోమీటర్ల మేర.. పొలం దారిని వేయించారు. బొల్లొరికుంట బాట 2 కిలోమీటర్లు, బాలయ్య కుంట పొలం దారి 3 కిలోమీటర్లు మొత్తం 10 కిలోమీటర్లు మేర గ్రామంలో ప్రధాన పొలం బాటలకు శాశ్వత పరిష్కారం మార్గం చూపారు. దీంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేశారు.

సీఎం సభకు వలంటీర్లు హాజరు కావాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శంకర్‌రావు, ఎంపీపీ దాసరి చౌడేశ్వరి

రెంటచింతల: ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్న వలంటీర్లకు గురువారం ఫిరంగిపురం మండలం రేపూడి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం అభినందన సభను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ పెదప్రోలు శంకర్‌రావు అన్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటున్న ఈ అభినందన సభకు మండలంలోని 11 గ్రామాలలో విధులు నిర్వహిస్తున్న 268 మంది వాలంటీర్లందరూ హాజరు కావాలన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఉదయం 11గంటలకు ఐదు బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వాలంటీర్లను సభకు తీసుకుపోయి, తిరిగి రెంటచింతలకు వచ్చే వరకు కార్యదర్శులు బాధ్యత తీసుకోవాలన్నారు. ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, ఈవోపీఆర్డీ జి.అనంత కోటేశ్వరరావు, కార్యదర్శులు వెంకయ్య, సుబ్బారావు పాల్గొన్నారు.

త్వరలో మెడికల్ కళాశాల అందుబాటులోకి..

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



కళాశాల పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి

పిడుగురాళ్లరూరల్: మండలంలోని బ్రాహ్మణపల్లిలో నిర్మిస్తున్న మెడికల్ వైద్యశాల, కళాశాలను ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన పల్నాడు ప్రాంత ప్రజల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.500 కోట్లతో 600 పడకల వైద్యశాల, మెడికల్ కళాశాల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేశారన్నారు. మొదటి ఫేజ్‌లో 100 పడకలను ప్రారంభించి పేద ప్రజలకు వైద్యం అందించేందుకు అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. ప్రారంభించిన నెల రోజుల్లోనే వైద్యశాలకు కావాల్సిన పరికరాలు, సిబ్బందిని, అధికారులను అందుబాటులోకి తీసుకొస్తామని మహేష్‌రెడ్డి చెప్పారు. 2025 జూన్ నాటికి కళాశాలను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. పల్నాడు జిల్లా నడిబొడ్డున ఈ వైద్యశాల, కళాశాల అందుబాటులో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి, ఎంపీపీ అల్లు సత్యవతి పిచ్చిరెడ్డి, వైఎస్ ఎంపీపీ గార్లపాటి వెంకటేశ్వరరెడ్డి, దాచేపల్లి మున్సిపల్ చైర్మన్ మునగా పున్నారావు, దాచేపల్లి జెడ్పీటీసీ ప్రకాష్‌రెడ్డి, సర్పంచ్‌లు వెంకటప్పయ్య, పీట వీరరాఘవయ్య, సొసైటీ అధ్యక్షుడు పిచ్చిరెడ్డి, వూజీ సర్పంచ్ బండి అంజిరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్సీ వస్త్ర పోటీలు

వెల్దుర్తి: మాచర్ల పట్టణంలోని పీడబ్ల్యూడీ కాలనీలోని వాణి విద్యానికేతన్ పాఠశాల 39వ వార్షికోత్సవం జరిగింది. ఈ వార్షికోత్సవంలో విద్యార్థులకు ఫ్యాన్సీ డ్రస్సు పోటీలు నిర్వహించారు. చదువుతో పాటు అన్నీ రంగాలలో నైపుణ్యం పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా నిత్య సహాయ మాత మహోత్సవాలు



వెల్దుర్తి: మాచర్ల పట్టణంలోని రింగురోడ్డు ప్రాంతంలో ఆర్‌సీఎం దేవాలయంలో నిత్య సహాయ మాత దేవాలయ మహోత్సవాలను మంగళవారం మాచర్ల విచారణ గురువులు కొమ్మారెడ్డి రఫేల్‌రెడ్డి, మర్రెడ్డి, రత్నబాబు, జోసఫ్, బాల సాగర్, కన్నా అనిల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవ భక్తులు ఊరేగింపుగా చర్చి ప్రాంగణానికి చేరుకొని తల్లికి ఒత్తులు సమర్పించి, బాణ సంచా కాల్చారు. విద్యుత్ దీప కాంతులతో మాచర్ల పురవీధుల్లో తేరు ప్రదర్శన జరిగింది.

విద్యుదాఘాతంతో రైతు మృతి



మృతి చెందిన రైతు శంకర్‌రెడ్డి

వెల్దుర్తి: పంట పొలంలో నీళ్లు పెట్టేందుకు వెళ్లి విద్యుదాఘాతానికి గురై ఓ రైతు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మాచర్ల పట్టణ శివారులోని రామప్ప దేవాలయం వద్ద మంగళవారం జరిగింది. పట్టణానికి చెందిన కొత్తకాపు శివశంకర్‌రెడ్డి(58).. రవి స్వీట్స్ షాపు నిర్వహిస్తున్నాడు. శివశంకర్‌రెడ్డి పట్టణ సమీపంలోని కౌలు పొలంలో నీళ్లు పెట్టేందుకు పొలానికి వెళ్లాడు. విద్యుత్ తీగలకు మరమ్మతులు చేపడుతున్న క్రమంలో విద్యుత్ షాక్‌కు గురైన మృతి చెందాడు. మృతుడికి భార్య, పిల్లలున్నారు. మాచర్ల పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మాచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కోడి పందేల స్థావరంపై దాడి

మాచర్ల రూరల్: కోడి పందేలు నిర్వహిస్తున్న వారిని అదుపులోకి, వారి నుంచి రూ.11,960లు నగదును స్వాధీనపర్చుకున్న ఘటన మండలంలోని జమ్మలమడక గ్రామ శివారులో మంగళవారం చోటుచేసుకుంది. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. గ్రామ శివారులో కొందరు కోడి పందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో దాడిచేసి, తొమ్మిది మందిని అదుపులోకి తీసుకొన్నట్లు తెలిపారు. పందెపు కోడిని స్వాధీన పర్చుకుని, కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ కె.రాజశేఖర్ తెలిపారు.

గ్రామంలోనే మెరుగైన వైద్యం



వైద్య సేవలందిస్తున్న డాక్టర్ విజయానాయక్

కారెంపూడి: గ్రామంలోనే మెరుగైన వైద్యాన్ని పేదలకు ఉచితంగా అందించాలని జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు కారెంపూడి ఎంపీపీ బొమ్మిన సావిత్రి పేర్కొన్నారు. పేటసన్నెగండ్ల గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ కార్డులను పంపిణీ చేశారు. 420 మంది గ్రామస్తులు వైద్య సేవలు పొందారు. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, స్పెషలిస్ట్ డాక్టర్లకు రిఫర్ చేశారు. ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్ పి.సింధూజ, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ పీఆర్ అలేఖ్య, వైద్యాధికారి ఎం.విజయానాయక్, డాక్టర్ ఎం.లక్ష్మణరెడ్డి వైద్య పరీక్షలు నిర్వహించారు. అప్తమాలజిస్ట్ డి.ప్రసాద్ సిబ్బంది 110 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, వారిలో 100 మందికి ఉచిత కళ్లజోళ్లు అందించాలని సిఫారస్సు చేశారు. గత క్యాంపులో కంటి పరీక్షలు చేయించుకున్న 180 మందికి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు కొంగర సుబ్రమణ్యం, సర్పంచ్ జవ్వాజి నాగేంద్రం, ఎంపీటీసీలు కొంగర ఇందిరాదేవి, గాడిపర్తి రమాదేవి, పార్టీ నాయకులు ఉన్నం గిరి, మాజీ సర్పంచ్ నర్సింగ నాగేశ్వరరావు, వెన్నపూసల బుల్లెబ్బాయి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మహేష్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు తగదు

దాచేపల్లి : నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిని విమర్శించే అర్హత మాజీ సర్పంచ్ మాశెట్టి పుల్లారావుకి లేదని వైఎస్సార్ సీపీ నేతలు మండిపడ్డారు. శ్రీనగర్ గ్రామంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. సీఎం జగన్, ఎమ్మెల్యే కాసుపై పుల్లారావు చేసిన వ్యాఖ్యలను వారు తీవ్రంగా ఖండించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో శ్రీనగర్‌లో కొట్లాది రూపాయల అభివృద్ధి పనులు జరిగాయని, నవరత్న పథకాల ద్వారా ప్రతి ఇంటికి లబ్ధి చేకూరిందని చెప్పారు. అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయటం తగదని హితవు పలికారు. కులాల మధ్య చిచ్చు పెట్టే వ్యాఖ్యలు మానుకోవాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు కాటుపల్లి శ్రీకాంత్, పాముల శంకర్, వంగూరి సాల్మన్‌రాజు పోలే సుధాకర్, కోటేశ్వరరావు, ఈర్ల కాశయ్య, సన్నెబోయిన గోపి, చింతా వెంకట రామరాజు, ఓర్సు నాగేశ్వరరావు, కుంచం గంగయ్య, షేక్ నాగుల్‌మీరా పాల్గొన్నారు.

దైవ సేవకులు ప్రజలను సన్మార్గంలో నడిపించాలి



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న పాస్టర్లు

గోలి(రెంటచింతల): దైవ సేవకులు క్రీస్తు బోధనలతో ప్రజలను సన్మార్గంలో నడిపించాలని పాస్టర్ సాల్మన్ పాల్ కోరారు. మంగళవారం గోలి గ్రామంలో తెలుగు బాప్టిస్ట్ చర్చిలో రెంటచింతల మండల పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. క్రీస్తు సూక్తులను ప్రజల్లోకి తీసుకెళ్లి వారిలో ప్రేమ, కరుణ, దయ, సేవ, శాంతి సమాధానాలు వంటి సద్గుణాలతో జీవించేలా మార్పు తీసుకురావాలన్నారు. అనంతరం ఫాస్టర్ సాల్మాన్ పాల్‌ను పాస్టర్లు ఘనంగా సన్మానించారు. మండల పాస్టర్స్ సంఘం అధ్యక్షుడు అంతోని, ఉపాధ్యక్షులు పి. భుదాసు, కోశాధికారి జోసఫ్, గౌరవాధ్యక్షులు ప్రభుదాస్, పాస్టర్లు కొమ్ము మోషే, ఎఫ్రాయుము, సుందరరావు, బాలజోజి, మహేష్, కొర్నేలి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా మైదానాల అభివృద్ధికి రూ. 25 లక్షలు



పనులు పరిశీలిస్తున్న విశ్వనాథ్

శావల్యాపురం: నియోజకరవ్గంలోని ఐదు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో క్రీడా మైదానాలు అభివృద్ధి పనులకు రూ. 25 లక్షలు నిధులు ప్రభుత్వం మంజూరు చేసినట్లు నాడు–నేడు మన బడి పథకం ఏఈ విశ్వనాథ్ తెలిపారు. మంగళవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి క్రీడా మైదాన పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఏఈ మాట్లాడుతూ ఒక్కో జెడ్పీ ఉన్నత పాఠశాల్లో క్రీడామైదానం అభివృద్ధి పనులతో పాటు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బాల్‌బ్యాట్‌మెంటిన్ క్రీడాకోర్టులు ఏర్పాటు చేయటానికి గాను పీఎంసీ నిధులు రూ. 5 లక్షలు మంజూరు చేసిందన్నారు. ఇందులో భాగంగా నూజెండ్ల–5 లక్షలు, శావల్యాపురం–5 లక్షలు, వినుకొండ రూరల్ నాగులవరం గ్రామంలో జెడ్పీ ఉన్నత పాఠశాల–రూ.5 లక్షలు, బొల్లాపల్లి మండలం వెల్లటూరు గ్రామం జెడ్పీ ఉన్నత పాఠశాలకు–రూ.5 లక్షలు, ఈపూరు మండలం ఈపూరు గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు రూ. 5 లక్షలు నిధులు మంజూరైనట్లు ఏఈ తెలిపారు. పనులు పరిశీలించిన వారిలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బోడ్డపాటి విజయలక్ష్మి, పాఠశాల పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి, సీనియర్ ఆంగ్ల బోధకులు బెజవాడ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

లావాదేవీలు స్తంభింపజేస్తాం

బాధిత రైతుల ఆందోళన



బ్యాంకు అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న బాధిత రైతులు

దొడ్లేరు(క్రోసూరు): దొడ్లేరు సీజీజీబీలో ఎనిమిది నెలల క్రితం గోల్‌మాల్ అయిన తాకట్టు బంగారాన్ని వెంటనే బాధిత రైతులకి అందించకపోతే బ్యాంకు లావాదేవీలు స్తంభింప చేస్తామని కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో బాధిత రైతులు బ్యాంకు అధికారులకు వినతిపత్రం ద్వారా హెచ్చరించారు. మంగళవారం చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు వద్ద బంగారం కోల్పోయిన బాధిత రైతుల సమావేశం జరిగింది. కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి టి.హనుమంతరావు మాట్లాడుతూ బ్యాంకులో బంగారం కనిపించకుండా పోయి 8 నెలలు కావస్తున్నప్పటికీ బ్యాంకు సిబ్బంది, ఉన్నత స్థాయి అధికారులు చెప్పే దానికి పొంతన లేదన్నారు. ఈ విషయంపై పలుమార్లు వివిధ స్థాయిలో అధికారులను కలిసినప్పటికీ స్పష్టమైన హామీ ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు బ్యాంకు లావాదేవీలను స్తంభింప చేస్తామని హెచ్చరించారు. అనంతరం రైతులతో సంతకాలు సేకరించి మెమోరాండం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆవుల ఆంజనేయులు, మర్రి రామకృష్ణారెడ్డి , షేక్ కరిముల్లా, ఇనగంటి రాంబాబు, కిషోర్, షేక్ ఆర్.బాజివలి, షేక్ నాగుల్ షరీఫ్, ఎ.వెంకటరమణ, శ్రీధర్‌బాబు ,పి.సాంబశివరావు, కె.వీరమ్మ, ఆవుల బాజీ, షేక్ రవుఫ్, గంట బాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బోయపాలెంలో ఆలయ ప్రతిష్ట


- 26న బోయపాలెంలో కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ట
- రూ.10 లక్షలతో దేవస్థానం, ప్రాంగణంలో స్వామివారి నామాలు ఏర్పాటు



దేవస్థాన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సభ్యులు

యడ్లపాడు: మండలంలోని బోయపాలెం గ్రామంలో శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రతిష్టా మహోత్సవాన్ని ఈనెల 26వ తేదీన నిర్వహించనున్నట్లు గ్రామ పంచాయతీ సర్పంచ్ వడ్డేపల్లి నరసింహరాజు తెలిపారు. గ్రామస్తుల సహకారంతో రూ.10 లక్షలతో హైవే పక్కన గతేడాది డిసెంబర్ 17న శంకుస్థాపన చేయగా కేవలం రెండు నెలల్లో దేవస్థాన పనుల్ని వేగంగా పూర్తి చేయడం జరిగిందన్నారు. ఆలయ ప్రతిష్ట కార్యక్రమాల్ని పురస్కరించుకుని ఈనెల 24న గ్రామంలో శోభాయాత్ర ఉంటుందన్నారు. అదే రోజు నుంచి దేవస్థాన ప్రాంగణంలో ప్రత్యేక పూజలు, హోమాలు ప్రారంభమవుతాయన్నారు. మూడవ రోజైన సోమవారం ఉదయం 6.30 గంటలకు పూజలు, హోమాలు ప్రారంభమౌతాయన్నారు. పూజల అనంతరం వేదపండితులచే స్వామివారి విగ్రహ ప్రతిష్ట జరుగుతుందన్నారు. 11.30 గంటలకు సర్వదర్శనం, 12 గంటలకు ప్రతిష్టా కార్యక్రమానికి విచ్చేసిన భక్తులకు అన్న ప్రసాద వితరణ మొదలవుతుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



పైడిపాటి సురేష్ మృతదేహం

సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన గండ్లూరు అడ్డ రోడ్డు సమీపంలో సోమవారం అర్ధరాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. మేడికొండూరు మండలం కొరప్రాడుకు చెందిన పైడిపాటి సురేష్ (27) తన బంధువుతో కలిసి ద్విచక్ర వాహనంపై పాకాలపాడులోని వివాహ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చాడు. పూలు తీసుకు రమ్మని చెప్పడంతో ద్విచక్ర వాహనంపై సత్తెనపల్లి వచ్చి తిరిగి వెళ్తున్నాడు. ఈ క్రమంలో అచ్చంపేట మండలం తాడువాయి నుంచి మిర్చి టిక్కీలతో వస్తున్న డీసీఎం వాహనం, ద్విచక్ర వాహనం గండ్లూరు అడ్డరోడ్డు సమీపంలో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో సురేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడు సురేష్‌ను అంబులెన్స్‌లో సత్తెనపల్లి వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య శోభ, పిల్లలు ఆకాంక్ష, అక్షయ ఉన్నారు. సురేష్ మృతి వార్త తెలియడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరయ్యారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, డీసీఎం వాహనాన్ని స్వాధీనపర్చుకొని సత్తెనపల్లి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా యువకుడు మృతి చెందినప్పటికీ బాధ్యులపై చర్యలు తీసుకోకుండా డీసీఎం వాహనాన్ని వదిలేస్తున్నారంటూ మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు మంగళవారం పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. దీంతో పోలీసులకు, బాధితులకు మధ్య వాగ్వావాదం చోటు చేసుకొంది. పోలీసులు వారికి నచ్చజెప్పి ఆందోళనను విరమింపజేశారు. తమకు న్యాయం చేయాలంటూ మృతుడి బంధువులు ఆందోళన చేయడంతో పంచాయతీ నడుస్తోంది.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

నరసరావుపేటటౌన్: ప్రయాణికులతో వెళ్తున్న ఆటోని లారీ ఢీకొన్న ఘటన మంగళవారం పట్టణ శివారు జొన్నలగడ్డ వద్ద చోటుచేసుకుంది. స్థానికులు వివరాల ప్రకారం ప్రయాణికులతో వస్తున్న ఆటోను మిర్చిలోడుతో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని ప్రయివేట్ వైద్యశాలకు తరలించారు. సంఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని రూరల్ ఎస్ఐ రోశయ్య తెలిపారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరి మృతి

నరసరావుపేటటౌన్: రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వన్‌టౌన్ పోలీసుల కథనం ప్రకారం .. పొడిమర్రు గ్రామానికి చెందిన మొగిలి సాయికృష్ణ (30) ద్విచక్ర వాహనంపై ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో పెట్రోల్ బంక్ వద్దకు వస్తుండగా ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ క్షతగాత్రుడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ సీఐ కృష్ణారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతుదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాల వద్దకు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మంగళవారం తెలిపారు.

కారు ఢీకొని ఒకరికి గాయాలు

నాదెండ్ల: ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా వస్తున్న కారు ఢీకొన్న ఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం గుంటూరు–కర్నూలు జాతీయ రహదారిపై సాతులూరు సమీపంలో చోటు చేసుకుంది. 108 సిబ్బంది తెలిపిన వివరాల మేరకు ఫిరంగిపురం మండలం నుదురుపాడు గ్రామానికి చెందిన మల్లికార్జున రావు వ్యక్తిగత పనులపై నరసరావుపేట నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. సాతులూరు వద్దకు వచ్చేసరికి గుంటూరు నుంచి నరసరావుపేట వైపు వెళ్తున్న కారు ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలైన మల్లికార్జునరావును 108 సాయంతో నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.